విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

ఆదివారం 13 జులై 2025 8 పేజీలు

ఏపీ అలనాటి విలువలు!

- ఉద్రేక రాజకీయాలకు నేతల ప్రాధాన్యత
- ఏ అంశమైనా పరుష పదజాలం వాడకం
- సోషల్ మీడియా వేదికగా బూతు పురాణం

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: సాంప్రదాయ రాజకీయాలకు స్వస్తి పలికి ఉద్రేక రాజకీయాలకు ప్రధాన పార్టీల నేతల ప్రయాణం సాగుతుందన్న భావన జిల్లాలో సర్వత్రా వ్యక్తమవుతోంది. రాజకీయ పార్టీలు మారుతున్న కాలంతో పాటు తమ పంథా మార్చుకున్నట్లుగా కనిపిస్తోంది. ఉద్రేక రాజకీయాలు చేస్తే హీరోయిజంగా భావించే నేటి రాజకీయ వ్యవస్థలో నాయకులు కూడా అదే పంథాను అనుసరిస్తున్నారు. పంటికి పన్ను... కాలుకు కాలు..హత్యకు ప్రతి హత్య అన్న చందంగా రాజకీయాలు మారుతున్నాయి. ఒకప్పుడు స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం పోరాటాలు సాగించి అవి సాధించుకున్నాం. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాటం సాగించాం. అనేక సమస్యలపై పోరాటాలు చేసి పరిష్కరించుకున్నాం. ప్రతిపక్షాలు సైతం ప్రజా సమస్యల కోసం నిరసన పోరాటాలు చేశాయి. అందుకు అనుగుణంగా పాలక పక్షాలు సమస్యలను పరిష్కరించాయి. ఇది రాజకీయ నాణానికి ఒకవైపు అయితే.. నాణానికి మరో కోణమే నేటి రాజకీయ పోకడలు. పార్టీలు, పార్టీల అధినేతలు, కార్యకర్తలు సైతం వ్యక్తిగత ప్రతిష్టలకు పోతుండడంతో సమస్యలపై పోరాటాలు కూడా తగ్గుతున్నాయి. సమస్యల సాధన కోసం గొంతెత్తిన స్వరాలను మూగబోయే విధంగా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడుతోంది. కొందరు నేతలు క్షుద్ర రాజకీయానికి తెర తీస్తున్నారన్న భావన సగటు మనిషిలో వ్యక్తమౌతోంది. అధికార పార్టీ ఒక విధంగా వ్యాఖ్యానిస్తే అదే రీతిన ప్రతిపక్షాలు తిప్పి కొడుతున్నాయి. ఎవరు అధికారంలో ఉన్నా వారి వైపే పోలీసులు ▶మిగతా 2లో..

ఏలేరు నీరు రాక రైతుల గగ్గోలు

- నారుమళ్లు వేయని పిఠాపురం నియోజకవర్గ ప్రజలు
- మంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే పిఠాపురం రావాలి
- కలెక్టర్, రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - పిఠాపురం : ఉభయగోదావరి జిల్లాల్లో రైతులు ఇప్పటికే నారుమళ్లు వేశారని కొన్ని ప్రాంతాల్లో ఉడ్పులు కూడా ▶మిగతా 2లో..

నాణ్యతతో తీర్పులుండాలి

రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్ రెడ్డి

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్ రెడ్డి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జ్యూడిషి యల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా అడ్మిని స్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్ రెడ్డి మాట్లా డుతూ న్యాయ మూర్తులు కేసులను త్వరిత గతిన విచారించి తీర్పులు వెలువ రించాలన్నారు. తీర్పులలో నాణ్యత లోపించకూడదన్నారు. సివిల్ కేసులు, విచారణలో

ఉన్న ఖైదీల కేసులను త్వరితగతిన తీర్పులను వెలువరించడానికి ప్రయత్నించాలని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కోర్టులలో ఉన్న పెండింగు కేసులు వివరాలు, భవన సముదాయాల పరిస్థితులపైన వివరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్.శ్రీదేవితో పాటు జిల్లాలోని ఇతర జిల్లా న్యాయమూర్తులు,సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు పోరాటం

విశాలాంధ్ర - ఆలమూరు : మహిళా హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విమల, పి.దుర్గాభవాని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రథమ మహాసభ గండి పద్మ అధ్యక్షతన ఆలమూరు సమత కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి హాజరైన విమల, దుర్గాభవాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలలో చెప్పినట్టు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15న అమలు చేస్తామని పేర్కొంటున్నారని, దాని విధివిధానాలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాలు, గంజాయి విచ్చలవిడిగా అందుబాటులోకి రావడంతో నేరాలు పెరిగాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన కూటమి ప్రభుత్వం అదే మార్గంలో ప్రయాణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మహిళా సమాఖ్య

జిల్లా నూతన కార్యవర్గాన్ని 15 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గండి పద్మ గౌరవ అధ్యక్షురాలిగా, బండారు సావిత్రి జిల్లా అధ్యక్షులుగా, పి.సూర్యప్రభ ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా పోతుల ఝాన్సీ, ఎస్. శారదాదేవి, సహాయ కార్యదర్శులుగా ఎస్. వరలక్ష్మి, శీలం గౌరీ పార్వతి, కోశాధికారిగా ▶మిగతా 2లో..

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

- పోలవరంలోకి భారీగా వరదనీరు
- స్పిల్‌వే నుంచి 7,43,222 క్యూసెక్కుల జలాలు విడుదల

విశాలాంధ్ర-పోలవరం : ఎగువ రాష్ట్రాలలో భారీ వర్షాల వల్ల గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది. పోలవరం ప్రాజెక్టులోకి గోదావరి వరద జలాలు రావడంతో శనివారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి చేరుకున్న 7,43,222 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ▶మిగతా 2లో..

వాగ్దానాల అమలుకు సీపీఐ శ్రేణులు ఉద్యమించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్దానాల అమలుకు సీపీఐ శ్రేణులు నిర్విరామంగా ఉద్యమించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లిగూడెం కపర్ధీ భవన్‌లో జరిగిన సీపీఐ తాడేపల్లిగూడెం 18వ మహాసభలో భీమారావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలిస్తామని, విదేశాల్లో వున్న నల్లధనం వెనక్కి తెచ్చి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమచేస్తామని, వంద రోజుల్లో ధరలు

తగ్గిస్తామంటూ ఇంకా అనేక వాగ్దానాలు గుప్పించి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్నా ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు. దేశ సంపదగా వున్న లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ లాంటి బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేస్తూ దేశానికి తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. మతతత్వాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచుతూ దేశంలో అశాంతికి ఆజ్యం పోస్తున్నారన్నారు. లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో చిత్తశుద్ధి కొరవడిందన్నారు. సీపీఐ పట్టణ సమితి సభ్యురాలు ఎన్. నాగలక్ష్మి మహాసభకు అధ్యక్షత వహించారు. తొలుత సీపీఐ పతాకాన్ని ▶మిగతా 2లో..

గోతిలో పడి చిన్నారి మృతి

- దివాన్ చెరువులో విషాదఛాయలు
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే, కూటమి నాయకులు

విశాలాంధ్ర - రాజానగరం : నాన్నా 20 రూపాయలు ఇవ్వండి...కూల్ డ్రింక్ (శీతలపానీయం) తాగివస్తా అని చెప్పి వెళ్లిన కొద్ది సేపటికే కుమారుడు విగతజీవిగా మారిన వైనం ఆ ప్రాంతంలో విషాదాన్ని నింపింది. ఈ సంఘటన తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దివాన్ చెరువు గ్రామంలోని రేగులచెరువు జంగాల కాలనీలో కడమంచి దుర్గారావు, మనమ్మతో పాటు వారి సంతానమైన ▶మిగతా 2లో..

14న మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 14న మెగా జాబ్ మేళా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.ఈ మేరకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కార్యాలయం శనివారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈ నెల 14న ఉదయం 9.30 గంటల నుంచి ఏలూరు సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మెగా జాబ్ మేళా జరుగుతుంది. ఈ జాబ్ మేళాకు 39కి పైగా కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు హాజరై 3 వేల మందిని అర్హత ప్రామాణికంగా పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ,బిఫార్మసీ, ఎంఫార్మసీ,బిటెక్,తదితర కోర్సులు పూర్తి చేసిన వారిని ఆయా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారు. అర్హత గల అభ్యర్థులందరూ ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. పూర్తి వివరాలకు 9493482414, 8978524022, 8143549464, 9618194377, 9885519299.నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సచివాలయ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - నరసాపురం: మొగల్తూరు మండలం కొత్తోట సచివాయ ఉద్యోగులకు గ్రామస్తులు శనివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఐదేళ్ల పూర్తయిన స్థానం నుంచి ఇతర ప్రాంతానికి బదిలీ చేయాలని ప్రభుత్వ నిబంధనల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి బందన నలినిప్రసాద్ ఉద్యోగోన్నతిపై, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తిరుమాని ముత్యాలరాజు, ఏఎన్ ఎం రాపాక పద్మావతిదేవి, ఫిషరీస్ అసిస్టెంటు పాము స్వాతి, మహిళా పోలీసు జుత్తిగ దేవిలు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు సత్తినేని శ్రీనివాసతాతాజీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఐదుళ్ల ప్రజలకు వారందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహనరావు, మాజీ సర్పంచి గట్టెం అర్కప్రసాద్ శ్రీనివాస్, సర్పంచి పడవల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి మృతి (1వ పేజీ తరువాయి)

దివ్య,శ్రీనులతో కలిసి నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతంలో స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది పైపులైన్ మరమ్మతు కోసం సుమారు వారం రోజుల క్రితం ఐదు అడుగుల లోతు గోతిని తవ్వి అలానే వదిలేశారు. దీంతో నీటితో ఆ గొయ్యి నిండిపోయింది. సమీపంలోని దుకాణంలో కూల్‌డ్రింగ్ తాగేందుకు వెళ్లిన కడమంచి శ్రీను (4) ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ ఆ గోతిలో పడిపోయాడు. విషయాన్ని తోటి పిల్లలు శ్రీను తల్లిదండ్రులకు చెప్పడంతో పరుగుపరుగున వెంటనే వచ్చి చూసేసరికి నీటిలో పైకితేలి కనిపించడంతో హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి,
తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు,బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లికార్జున స్వామి తదితరులు కుటుంబ సభ్యులను కలిసి మనోధైర్యం కల్పించారు. విషయాన్ని తెలుసుకున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం అర్ధరాతి సమయంలో కుటుంబ సభ్యుల్ని కలిసి పరామర్శించి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రోజువారీ కూలీగా జీవనం సాగిస్తున్న బాలుడు తల్లిదండ్రులకు ప్రభుత్వం నుండి అందవలసిన సహాయం లభించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.కలెక్టర్ వెంట రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్. కృష్ణ నాయక్, ఆర్‌డబ్ల్యు ఎస్ అధికారులు, పోలీస్, రెవిన్యూ శాఖల అధికారులు ఉన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ జనసేన నేత బత్తుల వెంకటలక్ష్మితో కలసి బాలుడి తల్లిదండ్రుల్ని పరామర్శించారు. సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి 5 లక్షలు నష్టపరిహారం, ఇంటి పట్టా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. వారికి మనోధైర్యం కల్పించి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఉద్యమించాలి (1వ పేజీ తరువాయి)

పార్టీ సీనియర్ సభ్యుడు అల్లం రాము ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి మాట్లాడారు. అనంతరం సీపీఐ తాడేపల్లి గూడెం పట్టణ నూతన సమితిని ఐదుగురితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మండల నాగేశ్వరరావు, సమితి సభ్యులుగా ఎస్.నాగలక్ష్మి, వద్దాది మేరీ, దాస్యం రాము, తూము సత్యనారాయణ ఎన్నికయ్యారు.

గోదావరి (1వ పేజీ తరువాయి)

ఎగువన 31.430 మీటర్లు, దిగువన 22.600 మీటర్లు. ఎగువ కాపర్ డ్యాం ఎగువన 31.900 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం దిగువన 22,050 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాంల మధ్య 16.080 మీటర్లు నీటిమట్టం నమోదయ్యింది. ప్రాజెక్టు దిగువన 10.78 మీటర్లు నమోదు అయ్యిందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి. గోదావరి లంక భూములు నీటమునిగాయి. గండిపోశమ్మ ఆలయం నీటమునగడంతో ఆలయానికి రాక పోకలను అధికారులు నిలిపివేశారు.

పోరాటం (1వ పేజీ తరువాయి)

కె. పద్మ ఎన్నికయ్యారు. ఆఫీస్ బేరర్లుగా కర్రి రోజా, కేతా పద్మజ, బొంతు దుర్గ, కాగిత విలాసమ్మ, మందపల్లి సుశీల, రొట్ట రాణి, నీతిపూడి తులసి ఎన్నికయ్యారు. వ్యవసాయ ఆధారిత జిల్లాలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు తీసుకురావాలని, ఆక్వా ఫిష్ కల్చర్ రంగంలో పని చేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి వారికి కార్మిక చట్టాలను అమలు చేయాలని, వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని లేదా, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించాలని, ప్రత్యామ్నాయంగా నిరుద్యోగ భృతి అందించాలని నూతన కమిటీ తీర్మానించింది.

గగ్గోలు (1వ పేజీ తరువాయి)

ఊడుస్తున్నారని, పిఠాపురం నియోజకవర్గం 3 మండలాల్లో ఏలేరు కాలవ నీరు సరిపోనందున నీరు లేక నారుమళ్లు వేయలేదని దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు విమర్శించారు. సీపీఐ కాకినాడ జిల్లా మహాసభల జయప్రదం కోరుతూ పిఠాపురం పట్టణంలో శనివారం ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ పిఠాపురం ఎమ్మెల్యేగా ఉన్న పవన్ కళ్యాణ్ పిఠాపురంలో రైతులకు న్యాయం చేయడంలో ఘోర వైఫల్యం చెందుతున్నారని అన్నారు. రైతు బాగుంటేనే దేశం, మన ప్రాంతం బాగుంటుందని అలాంటిది రైతు మానసిక క్షోభలో ఉన్నారని మంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే పిఠాపురం వచ్చి ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్, రైతులతో సమావేశం నిర్వహించాలని పేర్కొన్నారు. పంటలకు పూర్తి నీరు అందించే విధంగా కృషి చేయాలని మధు కోరారు.

ఈ నెల 16, 17 తేదీలలో సామర్లకోటలో జరుగు సిపిఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ, పట్టణ కార్యదర్శి రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి కేశవరపు, అప్పలరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. భవాని, ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ మడగల రమణ, అర్జున్ రావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎస్. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విలువలు (1వ పేజీ తరువాయి)

ఉంటున్నారన్న భావన కూడా సర్వత్రా వ్యక్తమవుతోంది. అదే రీతిలో ప్రతిపక్షాలు కూడా పోలీసు వ్యవస్థపై ఆరోపణలు సంధిస్తున్నాయి. గత 10 రోజులుగా అధికార పార్టీ శాసన సభ్యురాలిపై సాగుతోన్న ప్రచారం జిల్లా సరిహద్దులు దాటి ప్రజల మస్తిష్కంలోకి వెళ్లిపోయింది. దీంతో పాటుగా జిల్లాలో కూడా రెండు నియోజకవర్గాలలో అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది.ఎక్కడ చూసినా..ఎక్కడ విన్నా..ఇదే చర్చ.కొందరు వైసీపీకి అనుకూలంగా వ్యాఖ్యానిస్తే మరికొందరు అధికార కూటమి వైపు మాట్లాడుతున్నారు. ఏ చిన్న సంఘటన అయినా వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఇక్కడ అధికార పార్టీ మంత్రి,ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ అయినా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు అయినా ఉద్రేకంగా ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు.

ఒకప్పుడు పరోక్షంగా ఆరోపణలు చేసుకునే స్థాయి నుంచి ప్రత్యక్షంగా వ్యక్తిగతంగా తిట్టుకునే స్థాయికి రాజకీయాలు దిగజారుతున్నాయన్న భావన ప్రజలందరిలో వ్యక్తమవుతోంది. దీనికి తోడు వారి లోపాలతో పాటు కుటుంబ వ్యవహారాలను కూడా బజారుకీడుస్తున్న తీరు బాధాకరంగా ఉంది.

సోషల్ మీడియా వేదికగా తిట్ల పురాణం

ఉద్రేక రాజకీయాలకు కేంద్ర బిందువుగా సోషల్ మీడియా వ్యవహరిస్తుంది. ఎక్కడ సంఘటన జరిగినా, రాజకీయ నాయకులు మాట్లాడినా మాటలను వ్యంగ్యంగా చిత్రీకరిస్తున్నారు. ఒక్కొక్కసారి వారి ఫోటోలను మార్ఫులు చేస్తూ పార్టీ నేతల ఆగ్రహానికి గురవుతున్నారు. దీనికి తోడు ప్రధాన రాజకీయ పార్టీలకు నియోజక వర్గాల వారీగా సోషల్ మీడియాలు ఉండడంతో వారి చర్యలు ఇష్టారాజ్యంగా మారిపోతున్నాయన్న భావన కూడా ప్రజలలో పెరిగింది.

మారుతున్న జిల్లా రాజకీయాలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రాజకీయాలు గతంలో సాంప్రదాయ రాజకీయ విలువలతో ముడిపడి ఉన్నాయనడంలో ఎటువంటి సందేహంలేదు. స్వాతంత్ర సముపార్జనలో సర్వం ధారపోసిన వీరమాచనేని విమలాదేవి, వంక సత్యనారాయణ, అత్తులూరి సర్వేశ్వర రావు, కూనే రావు, కొండ్రు సుబ్బారావు, గారపాటి సత్యనారాయణ, భూపతిరాజు లక్ష్మీనరసింహ రాజు, పడాల శ్యామసుందరరావు, పిన్నమనేని రామచంద్రరావు, కరాటం బాబురావు, ఎస్.అర్.దాట్ల ఉద్దరాజు రామం, రుద్రరాజు సత్యనారాయణరాజు (అర్.ఎస్.) పోలిశెట్టి శేషావతారం, అల్లూరి కృష్ణారావు, లాంటి ఎందరో నేతలు ఇప్పటికీ ప్రజల మనసులలో ఉన్నారంటే వారి రాజకీయ నేపథ్యం ఎంత విలువలతో ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ విధంగా రాజకీయాలు చేశారు కాబట్టే ప్రజలు వారిని ఇంకా మరిచిపోలేదు. 1983 నుంచి రాజకీయాలు శరవేగంగా మారాయి. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్య మంత్రి కీ.శే. ఎన్టీ రామారావు రాజకీయాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సామాన్యులకు సైతం రాజకీయ బిక్ష పెట్టారు. 2014 నుంచి రాజకీయాలు పూర్తిగా మారిపోయాయని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కులం, పగ,ప్రతీకారం, మా పార్టీ..మీ పార్టీ అనుకుంటూ క్షుద్ర రాజకీయాలకు తెర తీశారు.ఈ నేపథ్యంలో వికృత చేష్టలతో కూడిన రాజకీయం తాండవి స్తున్న క్రమంలో పోలీసు వ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ , త్రాగునీరు సమస్యలపై దృష్టి

మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి

విశాలాంధ్ర -భీమవరం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మెంటేవారితోటలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు మద్దుల రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి తొలి ఏడాది పాలనపై ఇంటింటికి వచ్చి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. మెంటేవారితోటలో విద్యుత్, త్రాగునీరు సరఫరా సమస్యలను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సంబంధిత ప్రభుత్వ అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తలెత్తిన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. భీమవరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్ల బోయిన గోవింద్ మాట్లాడుతూ పట్టణంలో 39 వార్డుల్లో 116 పోలింగ్ బూత్‌లలో ప్రతిరోజు 40 కుటుంబాలను కలిసి వారి సమస్యలు, సలహాలు, సూచనలను మై-టీడీపీ యాప్ ద్వారా నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగ రాజు, క్లస్టర్ ఇంచార్జ్ పొత్తూరి బాపిరాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పులూరి చంద్రశేఖర్, టిడిపి నాయకులు మెంటే గోపి,ఎండి నౌషాద్, గంట త్రిమూర్తులు, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమా బేగం, ఎండి షబీనా తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: ఆపదలో ఉన్నవారికి సేవా కార్యక్రమాలు చేయడానికి , రోటరీ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామని నూతనంగా కొయ్యలగూడెం మండల రోటరీ క్లబ్ అధ్యక్షునిగా ఎన్నికైన మాదేటి సత్యనారాయణ పేర్కొన్నారు. రేపల్లెవాడ రోటరీ ఫంక్షన్ హాల్ వద్ద శనివారం రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుని ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మాదేటి సత్యనారాయణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుని క్లబ్ ద్వారా సహాయ సహకారాలు అందించడానికి ముందు ఉంటానని అన్నారు. రోటరీ సేవలు మరింత విస్తృతం చేస్తానని తెలిపారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అసిస్టెంట్ గవర్నర్ గా అయ్యలూరి విశ్వనాథశర్మ,సెక్రటరీగా కొనకళ్ల రామచంద్రరావు, ట్రెజరర్‌గా చిరాపూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. నూతనంగా ఎన్నికైన వారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్ర మంలో నిడదవోలు అసిస్టెంట్ గవర్నర్ గుంటుపల్లి శ్రీనివాస్, మాదేటి అప్పలరాజు, చోడిపిండి సుబ్రహ్మణ్యం,మజ్జి సూరి బాబు, ఎస్‌బిజి శేఖర్, మాటూరు సుధీర్, మద్దు మోహన్, గోపాలకృష్ణ, గంగిరెడ్డ సతీష్, మట్ట వంశి, రోటరీ క్లబ్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రంజాన్ బాబు సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర – కొయ్యలగూడెం : బాలబాట వ్యవస్థాపకులు డాక్టర్ రంజాన్ బాబు జయంతి సందర్భంగా మండలంలో మంగపతి దేవి పేట, రాజవరం, ధర్మారావుపేట గ్రామాలలో రంజాన్ బాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో రంజాన్ బాబు వికలాంగులకు, అనాధలకు, అనేకమైన పాఠశాలలు, వసతిగృహాలు ఏర్పాటు చేశారని తెలిపారు. చదువుకునే విద్యార్థులకు బాలబాట కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఎంతోమంది విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దారని , ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషకరమని ఏరియా కోఆర్డినేటర్ అపర్ణ తెలిపారు. ఈ కార్యక్రమాలలో అమరావతి, సత్యవతి, బాలబాట ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండలంలో పరింపూడి గ్రామపంచాయతీ పరిధిలో కొయ్యలగూడెం పట్టణంలో అశోక్ నగర్ నెయ్యిల వారి వీధిలోని సిసి రహదారిపైకి భవన నిర్మాణాలు చేపట్టడంతో ఇరుకుగా మారి , ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, స్వల్ప ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటు న్నాయని ఆ ప్రాంత ప్రజలు వాపోతు న్నారు. భవనాలు నిర్మించుకోవడానికి అవసరమయ్యే ఇసుక, ఇటుకలు, సిమెంట్ వంటి తదితర ముడి సరుకులు రోడ్డుపైనే నిలువ ఉంచడంతో , రహదారిపై రాకపోకలు కొనసాగించాలంటే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పలు సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటు న్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తూ శాశ్వతమైన ఆక్రమ కట్టడాలు నిర్మించడమే కాకుండా, రహదారిపైకి మెట్లు కూడా నిర్మించడంతో, రహదారి ఇరుకుగా మారింది. గ్రామ దేవత చింతలమ్మ గుడి వద్ద నుండి నెయ్యిల వారి కాలనీకి వెళ్లే రహ దారి ఇరువైపులా రోడ్డుపైనే గృహాలు నిర్మించుకోవడంతో వర్షపు నీరు కూడా వెళ్లడానికి వీలు లేకుండా రోడ్డు చెరువులను తలపించే విధంగా మారుతున్నది. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఎర్రచెరువు కాలనీలో పేదల ఇళ్ళకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: స్థానిక ఎర్రచెరువు కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ పాలకొల్లు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవి కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ గత కొంతకాలంగా ఎర్రచెరువు ప్రాంతంలో 100 కుటుంబాలపైన నివాసం వుంటున్నారని, వీరికి ప్రభుత్వం పక్కా గృహాలు కూడా మంజూరు చేసిందని తెలిపారు. వీరికి ఇంటిపన్నులు, కొళాయి బిల్లులు, కరెంటు బిల్లులు వున్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో కొంతమంది అధికారులు వేరే సర్వే నెంబర్ వేసి తాత్కాలికంగా కొంతమందికి పట్టాలు అందజేసారని, కూటమి ప్రభుత్వంలో కొత్త గృహాల నిర్మాణం కోసం అన్లైన్ చేయగా పట్టాలు లేని కారణంగా అన్లైన్ అవడం లేదని సంవత్సరాల తరబడి ఇక్కడే నివాసం వుంటున్న వీరికి శాశ్వతంగా పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఈ చెరువు వలన ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేవని అనుమతులు ఇవ్వాలని కోరగా మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ సంబంధిత అధికారు లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ప్రమాదాలకు నిలయంగా కల్వర్టులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో జీడీఎం చర్చ్ పక్కనుండి అశోక్ నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఇటీవల కాలంలో నిర్మించిన కల్వర్టు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారిపై వెళ్లాలంటే కల్వర్టు దాటాల్సిందే. రోడ్డుకు సమానంగా వేయవలసిన కల్వర్టు ఎక్కువ ఎత్తుతో నిర్మించడం వలన ద్విచక్ర వాహనాల వారు, పాఠశాలల బస్సులు, కార్లు, టాటా మ్యాజిక్కులు ప్రమాదాలకు గురవుతున్నాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న కల్వర్టులను ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించాలి కానీ, ప్రజలకు ప్రమాదాలు జరిగే విధంగా నిర్మించకూడదని అశోక్ నగర్ ప్రాంత వాసులు, రహదారిపై రాకపోకలు కొనసాగించే వాహన చోదకులు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు కల్వర్టు ఎత్తు తగ్గించాలని , ప్రమాదాలను అరికట్టాలని కొయ్యలగూడెం గ్రామ వాసులు వాపోతున్నారు.



వరద బాధితులకు పునరావాస కార్యక్రమాలు

విశాలాంధ్ర-ఏలూరు: గోదావరి వరద ముంపు ప్రమాద మండలాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని వరద ముంపు బాధితులను దాచారంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద పునరావాస శిబిరానికి తరలించి, ప్రజలకు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి పునరావాస కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. వరద నిర్వాసితులకు వరద శిబిరంలో చక్కని వసతి సౌకర్యాలు కల్పించారు. భోజనానికి సంబంధించి నిత్యావసర సరుకులు, వంట సామాగ్రిని శిబిరానికి తరలించి శిబిరంలో ప్రజలకు భోజనాన్ని అందిస్తున్నారు. త్రాగునీటి కొరత ఎక్కడా లేకుండా చర్యలు తీసుకున్నారు. టాయిలెట్లు, శిబిరం పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది దాచారం వరద శిబిరంలో వైద్య కేంద్రాన్ని ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. కుక్కునూరు మండలంలోని అన్ని గ్రామాలలో వరద ప్రమాద హెచ్చరికపై టాంటాం చేస్తూ, మండలంలోని ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.జిల్లా సర్వే అధికారి అన్సారీ, తహసీల్దార్ కె. రమేష్ కుమార్, రెవిన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యు ఎస్., తదితర శాఖల సిబ్బంది పునరావాస కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐటిఐలపై విద్యార్థుల ఆసక్తి

విశాలాంధ్ర-లింగపాలెం: ఐటిఐల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పేద,మధ్య తరగతి విద్యార్థులు ఐటిఐ విద్యను చదవాలని కోరుకుంటున్నారు.పదవ తరగతి ఉత్తీర్ణత అయ్యాక పైచదువులు చదివేందుకు ఆర్థిక స్తోమత,ఉద్యోగ అవకాశాలు పరిశీలించుకొని ఐటిఐ పట్ల మొగ్గు చూపుతున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు పైచదువులు చదివేందుకే ఆసక్తి చూపేవారు. ఇప్పుడు పరిస్థితులు మారటంతో ఉపాధి కలిగే టెక్నికల్ కోర్సుల పైన దృష్టి పెడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రధానంగా మొక్కజొన్న ఫ్యాక్టరీల స్థాపన జరగటంతో ప్రతి ఏడాది ఈఫ్యాక్టరీలలో వేలాదిమందికి కొన్ని నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. సాంకేతిక విద్య ఉన్నవారికి ఈ ఫ్యాక్టరీలలో పర్మినెంట్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. సాంకేతిక విద్య నైపుణ్యం ఉండటంవల్ల రోజువారి ఉపాధి కలుగుతుంది. దీంతో ఐటిఐలకు డిమాండ్ పెరిగింది. ఎలక్ట్రికల్, ఫిట్టర్ కోర్సులకు డిమాండు అధికంగా ఉంది.రెండేళ్లలో కోర్సు పూర్తవుతుంది.కోర్సు అవ్వగానే వీరికి ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. దీంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఐటిఐ చదివించడానికి మొగ్గు చూపుతున్నారు. ధర్మాజీ గూడెంలో ఉన్న ఐటిఐలో చేరేందుకు స్థానికులే కాకుండా తెలంగాణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులు వస్తున్నారు. దీంతోపాటు చింతలపూడిలోని,ఏలూరులోని ఐటిఐ లలో చేరేందుకు వెళ్తున్నారు. ఐటిఐలకు ఉన్న డిమాండును బట్టి ప్రభుత్వం ప్రోత్సాహం అందించాల్సిన అవసరాన్ని గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థలో వైద్యశాల భవనం

- ధర్మాజీగూడెం ఏరియా పశు వైద్యశాలలో సౌకర్యాలు కరువు
- అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన భవన నిర్మాణం

విశాలాంధ్ర-లింగపాలెం: మూడు మండలా ల్లోని 15పశు వైద్యశాలలకు కేంద్రంగా ఉన్న ధర్మాజీగూడెం ఏరియా పశువైద్యశాలలో సౌక ర్యాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి భవనాన్ని 1977లో నిర్మించారు. అప్పటిలో నిర్మించిన ఈ భవనం కొన్నాళ్లగా శిథిలావస్థకు చేరుకుంది. ఉన్న భవనం సరిపోవ టం లేదు. వర్షం వస్తే నీరంతా భవనం లోపలే ఉంటుంది. భవనానికి ఉన్న స్లాబ్ పెచ్చులుగా ఊడిపోతుంది. ఒకప్పుడు ఈఆసుపత్రి విస్తీర్ణం తక్కువగా ఉండేది. ఇప్పుడు విస్తీర్ణం పెరగటం, పశు వులు, గొర్రెలు, మేకలు, శునకాల సంఖ్య పెరగటంతో ఆసుపత్రికి డిమాండు అధికంగా ఉంది. ఇటువంటి ఆసుపత్రి భవనం శిథిలమవ టంతో వైద్యశాలకు వచ్చే జీవాల పెంపకదారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా ఆసుపత్రి కావడంతో ఇక్కడ నుంచి లింగపాలెం,ే ఽ.కోట, ముసునూరు మండలాల్లోని 15 ఆసుపత్రులకు మందులు పంపిణీ చేస్తున్నారు. మందులను నిల్వ ఉంచేందుకు పాత భవనంలో సదుపాయాలు లేవు. మందులు నిల్వ ఉంచడానికి నానా తంటాలు పడుతున్నారు. ధర్మాజీగూడెంలో నూతన భవన నిర్మాణానికి 9 ఏళ్ల క్రితం నాబార్డ్ రూ.1కోటి మంజూరు చేసింది. భవన నిర్మాణం 75శాతం పూర్తయినా మిగతాది పూర్తి చేయడం లేదు. దీన్ని పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. నూతన భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మిస్తే ఆసుపత్రిని మార్చుకోవచ్చు. దీనిపై ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారో? అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్య కోసం ఎన్ని కష్టాలో...!

అధ్వానంగా రోడ్లు.. అరకొర వసతులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : రాష్ట్రంలో వివిధ పార్టీలు పరిపాలన సాగిస్తూ విద్యార్థుల కోసం అధునాతనమైన టెక్నాలజీతో విద్యను అందిస్తున్నాయి. విద్యార్థులకు యూనిఫామ్, తల్లుల ఖాతాలలో నగదు జమ, పుస్తకాలు,

బూట్లు, బ్యాగులు అందిస్తూ విద్యార్థులకు మంచి ప్రోత్సాహన్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో నివసించే విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు చేరుకోవాలంటే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. మండలంలో అచ్యుతాపురం గ్రామపంచాయతీ శ్రీరంగపట్నం గ్రామం నుండి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు చినుకు పడితే మోకాళ్ళ లోతులో నుండి సైకిల్ నెట్టుకుంటూ, నడుచుకుంటూ , అనేక సమస్యలతో పాఠశాలలకు సరైన సమయానికి వెళ్లలేక పోతున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో రోడ్లను నిర్మించాలని కొయ్యలగూడెం సమైక్య యూత్ అధ్యక్షులు గంగిరెడ్ల సతీష్ పేర్కొన్నారు.

జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలి

విశాలాంధ్ర -భీమవరం: మేధావులు ఉన్నత స్థానాల్లో ఉన్న సీనియర్లు ప్రస్తుత విద్యార్థులకు తమ తమ అనుభవాలతో ఇంటర్న్ షిప్పు సౌకర్యం కల్పించటం, ప్రత్యేక సెమినార్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఈ దిశగా పూర్వ విద్యార్థులు ఆలోచించాలని ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ,

కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ సూచించారు. 1996- 2000 బ్యాచ్‌లో సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల రజతోత్సవం శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి సివిల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ జి.శ్రీ బాల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వీ రంగరాజు, డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యా విధానంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. అందువలన విద్యార్థులకు ఎప్పటికప్పుడు లేటెస్ట్ టెక్నాలజీని అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్‌కు చెందిన ప్రొఫెసర్ వి.కె.విశ్వనాథరాజు, ప్రొఫెసర్ జి.వి.పద్మరాజు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం చేస్తున్న కృషిని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యు.వెంకటపతిరాజు డాక్టర్ పి.ఎ రామకృష్ణంరాజు, ప్రొఫెసర్ అర్జునరాజు, ప్రొఫెసర్ శివరామరాజు, ప్రొఫెసర్ రామరాజులను ఘనంగా సత్కరించారు. పలువురు పూర్వ విద్యార్థులు యుఎస్ నుంచి కూడా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

డెంగీపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-టి నరసాపురం: డెంగీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్వి ప్రసాద్ తెలిపారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్ళి మానవ హారం నిర్వహించి డెంగీ



నివారణ పై నినాదాలు చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి జె.కల్పనారాణి అధ్యక్షతన డెంగీ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసాద్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా దోమ కాటుకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ మైదమ్మ, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె. శ్రీనివాసరావు, ఎమ్ ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎమ్ లు, ఆశాలు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల గుప్పెట్లో... పోలవరం కుడి కాల్వ గట్టు

అక్రమ భూముల్లో బిందు సేద్యం, వరి సాగు

విశాలాంధ్ర- ఉంగుటూరు : కాదేదీ కవితకి అనర్హం అన్నారు మహాకవి శ్రీ శ్రీ. కాదేదీ కబ్జాలకు అవరోధం అన్నట్లుంది ఆక్రమణ దారుల వైఖరి. పోలవరం భూసేకరణ సమయంలో అనేకమంది రైతులు తమ భూముల్ని అప్పగించి నష్టపరిహారం పొందారు. కానీ ఆ తర్వాత అసలు కథ మొదలయ్యింది. కాలువకి ఇరువైపులా ఉన్న స్థలాలకు ఆనుకొని ఉన్న కొండలు, గుట్టలు ఆక్రమణదారులకు అడ్డాగా మారాయి. నేడు ఆ కొండ గుట్టలు తరిగి పోయాయి. అక్కడి కంకర, మట్టి అక్రమ తరలింపునకు లోనయ్యింది. ఏకంగా నేడు ఆక్రమణ దారులు పంటలు పండిస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు అక్కడి పరిస్థితి.

వివరాల్లోకి వెళితే.... ఉంగుటూరు మండలం గొల్ల గూడు వద్ద ఉన్న పోలవరం కుడి కాలువ తీరం లో ఉన్న గొల్ల గూడెం, కంసాలిగుంట గ్రామాల మధ్య గల కొండ గుట్టలు ఆక్రమణలకు లోనయ్యాయి. పోలవరం కుడి కాలువ నిర్మాణమునకు ఆనుకొని ఉన్న కొండ గుట్టలు కొల్లగొడుతుంటే అడ్డుకోనే వారే లేక పోయారు. అక్కడి కంకర, మట్టి అక్రమ తరలింపుతో ఆక్రమణదారుల జేబులు నిండాయి. అక్కడితో ఆగితే చెప్పుకునేదేముంది? గొల్లగూడెం వద్ద అక్రమంగా మోటర్లు బిగించి కుడికాలువ నీరును ఆయిల్ ఇంజన్ ద్వారా తోడుతున్నారు. పోలవరం కుడి కాల్వకు ఇరువైపులా బిందు సేద్యంతో జేబులు నింపుకోవాలని ఏకంగా పైపులు ఏర్పాటు చేసి, సాగుకు రంగం సిద్ధం చేశారు. గొల్ల గూడెం కంసాలి గుంట మధ్య పంట సాగుకు పూనుకున్నారు. ఆఘమేఘాల మీద గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారం సాగుతోంది. ప్రస్తుతం ఆకుమడులకు సైతం రంగం సిద్ధం చేశారు. ఆక్రమణదారుల దందా చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

సురక్షిత ప్రాంతాలకు ప్రజలు

విశాలాంధ్ర-వేలేరుపాడు: వేలేరుపాడు మండలంలో వరద ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరద సహాయ పునరావాస కార్యక్రమాలను జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి. రమణ, డి.ఆర్. డి.ఏ ప్రాజెక్ట్ అధికారి ఆర్. విజయరాజు దగ్గ రుండి పర్యవేక్షిస్తున్నారు. ముందుగా వరద ప్రభావానికి గురైన రేపాక గొమ్ము గ్రామంలోని ప్రజలను తాడువాయిలోని ఆర్. అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద సహాయ పునరావాస శిబిరానికి తరలించారు. ఈ సందర్భంగా వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి. రమణ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి పునరావాస కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. వరద పునరావాస శిబిరాలలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. టార్పాలిన్లు, బోట్లు,లైఫ్ జాకెట్లు, గజఈతగాళ్లను, మంచి సామర్థ్యం కలిగిన సిబ్బందితో కూడిన రోప్ పార్టీలు అందుబాటులో ఉంచాలన్నారు. పునరావాస కార్యక్రమాల నిర్వాహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేదని ఆర్డీఓ స్పష్టం చేశారు.పునరావాస కేంద్రాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, పునరావాస కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు.ప్రజలను తరలింపు కార్యక్రమం, పునరావాస కాలనీలో ఏర్పాట్లను, వైద్య శిబిరంలో వైద్యసేవలను పరిశీలించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి. రమణ,డి.ఆర్. డి.ఏ.ప్రాజెక్ట్ అధికారి ఆర్. విజయరాజు పరిశీలించారు. పునరావాస శిబిరంలో విద్యుత్ సౌకర్యం, జెనరేటర్లు ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ జి.సత్యనారాయణ, రెవిన్యూ,పౌర సరఫరాలు, పంచాయితీరాజ్, పోలీసు, ఆర్‌డబ్ల్యూఎస్., తదితర శాఖల సిబ్బంది పునరావాస కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పంతుల సూర్య W/o. నాగరాజు, డోర్‌నెం.5-43, ఇందిరమ్మ కాలనీ, తోకలపల్లి (గ్రా), నిడమర్రు (మం) పిన్: 534406 ఏలూరు జిల్లా., నేను ది.25.06.2025 తేదీన ఉదయం 11 గం॥లకు తోకలపల్లి నుండి పెదనిండ్రకొలను సెంటరుకు ఆటోలో ప్రయాణమయ్యి వెళ్లుచుండగా పెదనిండ్రకొలను గ్రామంలో పాలిథిన్ కవర్లోని నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ L5192562 పడి పోయినది. ఎంత వెదికినను దొరకలేదు. కావున ఎవరికైనను దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందచేయగలరు.

స్మార్ట్ మీటర్లకు నిరసనగా నేడు విజయవాడలో రాష్ట్ర సదస్సు

బి.కె.ఎం.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-ఏలూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లు పేరుతో ప్రజలపై భారాలు మోపడానికి ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికె.యం.యు.)రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు.

2020 విద్యుత్ సంస్కరణ బిల్లులో భాగంగా వ్యవసాయ మోటార్లకు, వర్తక వాణిజ్య సంస్థలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించిందన్నారు. గృహ వినియోగదారులకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రజలపై అనేక భారాలు మోప బడతాయని ఆయన తెలిపారు.

ఇప్పటికే గృహ వినియోగదారులు ట్రూఅప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు తదితర రూపాలలో అధిక బిల్లుల భారాలు మోస్తున్నారని ఆయన పేర్కొన్నారు.స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆదివారం జరుగుతున్న రాష్ట్ర సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పాల్గొనవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజా సేవలో చెరగని ముద్ర వేసుకున్న బుజ్జి

ఎమ్మెల్యే బడేటి చంటి నివాళులు

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : ఏలూరు నియోజకవర్గ చరిత్రలో తనదైన శైలిలో ప్రజా సేవ చేసి చెరగని ముద్ర వేసుకున్న మాజీ ఎమ్మెల్యే దివంగత బడేటి బుజ్జి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కొనియాడారు. తన ఐదేళ్ల కాల పరిమితిలో తాను అనుకున్న లక్ష్యాలను సాధించి, ప్రజల హృదయాలలో శాశ్వత స్థానం సంపాదించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఏలూరు పవర్ పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, దివంగత బడేటి బుజ్జి 61వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జి విగ్రహానికి ఆయన సోదరుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభిమా నులు, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే చంటి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రాజకీయం శాశ్వతం కాదని, నమ్ముకున్న వారికి, ప్రజలకు శాశ్వత మేలు చేయాలన్నదే తన అభిమతమని పేర్కొన్నారు. 2014 -19 మధ్య ఏలూరు నియోజకవర్గంలో అభివృద్ధితో కూడిన సుపరిపాలన అందించిన ఘనత మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జికే దక్కుతుందని పేర్కొన్నారు. తన తండ్రి బడేటి శ్రీహరిరావు, అన్న బడేటి బుజ్జి ఆశయాల సాధనకు రాజకీయాలలోకి వచ్చానని, తన లక్ష్య సాధన దిశగా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా కృషి చేస్తానని

పేర్కొన్నారు. ఈ సందర్భంగా 22 మందికి 14 లక్షల 94 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను, ఇద్దరికి తోపుడు బండ్లను, నలుగురికి వీల్ చైర్లను, ఇద్దరికి కుట్టుమిషన్లను, ఇద్దరికి చెవిటి మిషన్లను, ట్రై సైకిళ్ళు, ఒకరికి ల్యాప్ టాప్, ఒకరికి వైద్యం నిమిత్తం 10000 రూపాయలు, 250 మంది జూనియర్ కళాశాల విద్యార్థులకు యూనిఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఏలూరు నగర టీడీపీ అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్లు వందనాల దుర్గాభవాని, పప్పు ఉమామహేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-ఏలూరు: కామవరపుకోట మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం మండల విలేకర్లు ఎన్నుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశం గౌరవ అధ్యక్షులు టీవీఎస్ రాజు అధ్యక్షతన జరిగింది. కామవరపుకోట ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షులుగా వీరమళ్ల మధుసూధన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా దాసి భూషణం, కోశాధికారిగా పుట్టా శుభాష్, సహాయ కార్యదర్శిగా ఇమ్మడి స్వామి, సహాయ కోశాధికారిగా మానుకొండ మాణిక్యాలరావును ఎన్నుకున్నారు. టీవీఎస్ రాజు మాట్లాడుతూ నూతన కార్యవర్గం మండల ప్రజలకు, అధికారులకు మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలికితీస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. నూనత అధ్యక్షుడు వీరమళ్ల మధు మాట్లాడుతూ మండల విలేకర్లు అందరూ ఐక్యతతో ఉండాలని.. ప్రజా వార్తలతో ప్రజల అభిమానం చూరగొనాలని తెలిపారు. సమావేశంలో టీవీఎస్.రాజు, వైవీఎస్.రామచంద్రరావు,ఎన్. లక్ష్మయ్య, ఎం.వేణు, ఉస్సే లక్ష్మీనారాయణ, కడిపి పాపారావు, ఆర్. సత్యనారాయణ, ఓ అభిషేక్ పాల్గొన్నారు.

మానవత్వంచాటుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకా తిరుమల మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన పేచ్చేటి వీరాంజనేయులు కిడ్నీ సంబంధితవ్యాధితో బాధపడుతూ, విజయవాడ క్యాపిటల్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. కిడ్నీ మార్పిడి చేయవలసిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. కానీ వారికి వైద్యం చేయించుకోవ దానికి అంత స్తోమత లేదని స్థానిక నాయకులు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి, 3.50,000, ఎల్ ఓ సి మంజూరు చేయించారు.సంబంధిత, పత్రాలను శనివారం బాధితుడికి, హాస్పటల్ సిబ్బందికి, ఆ పత్రాలను నాయకుల ద్వారా అందజేశారు. దీని ద్వారా వారి కుటుంబ సభ్యులు కిడ్నీ ఇవ్వడానికి, సిద్ధపడటంతో, కిడ్నీ మార్పిడి చేయడానికి హాస్పిటల్ వారు ఏర్పాట్లు చేశారు.వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మూడున్నర లక్షల రూపాయలు, మంజూరు చేయించి నందుకు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకి, రామన్నగూడెం గ్రామ నాయకులు, వారి కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మద్రాస్ రాము, గ్రామపార్టీ అధ్యక్షులు కమ్మ సత్యనారాయణ, బుట్టాయిగూడెం గ్రామపార్టీ అధ్యక్షులు కేత గౌరీశ్వరరావు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు సహాయం

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు నష్టపోయిన బాధిత కుటుంబ సభ్యులకు క్రీస్తు కృప మినిస్ట్రీస్ భూదేవిపేట సంఘం వారు శనివారం సహాయం అందించారు. మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన బద్దం సదరయ్య, మేరీ దంపతుల పూరిల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయిన విషయం విధితమే. ఆ కుటుంబానికి తమ వంతు సాయంగా నిత్యావసర సరుకులు, వంట సామాగ్రి, బియ్యం, దుప్పట్లు, దుస్తులు, వెయ్యి రూపాయల నగదు సంఘం వారు అందించారు. ఈ కార్యక్రమంలో తాట్కూరు గొమ్ము ఉప సర్పంచ్ కర్నాటి రాజా, సంఘ సేవకులు పాస్టర్ ఆర్.ఐజాక్ రిబ్కా, నకిరికంటి శివన్నారాయణ, సముద్రాల నరసింహారావు, పెద్దారపు సురేష్, పానుగంటి నరసింహారావు, కూనవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అనంతేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి మల్లికార్జున్

విశాలాంధ్ర - కడియం : కడియం ప్రాంతం గ్రీన్ వరల్డ్ గానే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయముగా ఉందని కర్ణాటక రాష్ట్ర మైనింగ్, జియాలజీ, హార్టికల్చర్ శాఖ మంత్రి ఎస్ ఎస్ మల్లికార్జున్ అన్నారు. కడియం మండలం కడియపులంక గోదావరి తీరం శ్రీ హరిహర మహా క్షేత్రంలో కొలువైయున్న శ్రీ అపర్ణ సమేత అనంతేశ్వర స్వామిని ఆయన దర్శించుకోగా ఆలయ ప్రధాన అర్చక స్వామి దేవరభట్ల శ్రీనివాస శర్మ (నాని) ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రికి ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లికార్జున్ మాట్లాడుతూ ఒకే ప్రాంగణంలో అందరి దేవతామూర్తులను నెలకొల్పి తమ భక్తి భావాన్ని చాటుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మల్లు పోలరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఆరేటి వీరభద్రరావు, పెనుమాక శ్రీనివాసరావు, నక్కా ప్రసాద్, చిక్కాల సత్యనారాయణ, మండేలా కృష్ణ, అలా పెదబాబు, రత్నం అయ్యప్ప, బొరుసు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉద్యోగులు భర్తీ చేయాలి

విశాలాంధ్ర- కొవ్వూరు : శనివారం ఉదయం స్థానిక కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో తూర్పు గోదావరి జిల్లా క్లాస్-4 ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితను కలిసిన నాల్గోవ తరగతి ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయడం, ప్రతి సంవత్సరం సమయానికి యూనిఫాం పంపిణీ చేయడం వంటి అంశాలపై దృష్టి సారించ వలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అధ్యక్షుడిగా తూర్పు గోదావరి జిల్లా క్లాస్-4 ఎంప్లాయిస్ అసోసియేషన్ నేత చిలకల వెంకటరమణ వ్యవహరించగా, సభ్యులు ఎండీ తాజుద్దీన్, ఎం. సుబ్రమణ్యం తదితర క్లాస్-4 ఉద్యోగులు పాల్గొన్నారు. ప్రతి మండలంలో కనీసం రెండు అటెండర్ పోస్టులు, ఒక నైట్ వాచ్‌మెన్ పోస్టు ఉండాలన్నారు. ప్రస్తుతం చాలా చోట్ల ఈ పోస్టులు ఖాళీగా ఉండటంతో సేవలందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమావేశంలో తెలిపారు.

అన్నదాత సుఖీభవ రైతుల అర్హుల జాబితా

విశాలాంధ్ర - సీతానగరం: అన్నదాత సుఖీభవకు 6875 రైతులు అర్హుల జాబితా వచ్చింది అని మండల వ్యవసాయ అధికారిని ఏ గౌరీ దేవి అన్నారు. ఈ సందర్భంగా గౌరీ దేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలలో ఒకటి అయినా అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా అన్ని గ్రామాలలో ఉన్న సచివాలయాల్లో రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. అనర్హులుగా వున్న రైతులు గ్రీవెన్స్ అర్జీలను సచివాలయంలో ఉన్న వ్యవసాయ అధికారికి అందించాలన్నారు. గ్రీవెన్స్ అవకాశం జులై 13వ వరకు వుందన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే బత్తుల

విశాలాంధ్ర - సీతానగరం: గోదావరి ఉధృతి దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం మండలంలో ముల్లకల్లంక లంక గ్రామంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆకస్మికంగా పర్యటించారు. దీనిలో భాగంగా బొబ్బిల్లంక గ్రామం చేరుకొని అక్కడ నుంచి పడవ ద్వారా ముల్లకల్లంక గ్రామం చేరుకొని ఆ గ్రామంలో ప్రజలతో కలిసి గోదావరి వరదల వల్ల కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి గోదావరి వరద పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చేపట్టవలసిన చర్యలను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. అధికారులతో పాటు ప్రజలందరూఅప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏ ఈ శివ ప్రసాద్, సర్పంచ్ గోవింద రాజు, మండల కన్వీనర్ మట్టా వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పెండ్యాల ఆసెన్ బాబు, పోలిన పృధ్వీ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్రంలో జవాబుదారి ప్రభుత్వం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-దేవరపల్లి: రాష్ట్రంలో జవాబు దారి ప్రభుత్వాన్ని అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కృష్ణ పాలెంలో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు కరపత్రాలు అందజేశారు. కూటమిప్రభుత్వ పరిపాలన సంవత్సరం పూర్తయిన సందర్భంగా అమలు చేసిన కార్యక్రమాలను ఆయన వెల్లడించారు సంవత్సర కాలము నుంచి కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో అమలు జరుగుతుందన్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో అవినీతి అరాచక పరిపాలన కొనసాగిందని ఆయన తెలిపారు గోపాలపురం నియోజకవర్గంలో రూ.70 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రాబోవు రోజులలో అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అనుభవిజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాయణ లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత సర్వతోముఖాభివృద్ధి చెందుతుం దన్నారు. అనంతరం ఎర్రగూడెం ధూమంతునిగూడెం, సుబ్బరాయపురం, రామన్నపాలెం గ్రామాలలో ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిక్కిన నాగరాజు, సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, ఏడుకొండ, గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి చినబాబు, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రామారావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజాసంక్షేమ పాలనే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొవ్వూరు: రాష్ట్ర అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమ పాలనే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంక టేశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు పట్టణంలోని 5వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు డోర్ టు డోర్ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని పెంపొందిస్తాం : వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - రాజానగరం,సీతానగరం : ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల నమ్మకాన్ని పెంపొందించే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని తూర్పు గోదావరి జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. నియోజవర్గంలోని దోసకాయలపల్లి,కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను(పి.హెచ్.సి) డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆయా ఆసుపత్రులు రికార్డులు, ఆసుపత్రి వార్డులు,ప్రాంగణాలు పరిశీలించారు.ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఐవిఆర్ ఎస్ వ్యవస్థపై ప్రజల అభిప్రాయాలు, సీజనల్ వ్యాధులపై సిబ్బంది సిద్ధత వంటి అంశాలపై సమీక్షలు నిర్వహించారు. ఫీల్డ్ స్థాయిలో ఆరోగ్య కార్యక్రమాల, వైద్య సేవల అమలును సమీక్షిస్తూ, అవసరమైన మందుల నిల్వలు, తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాల పనితీరుపై నిరంతర మానిటరింగ్ కొనసాగించబడుతుందన్నారు .జిల్లా ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

బరితెగింపు!

- అధికారుల మీదే దాడులు చేస్తున్న ఇసుకాసురులు..
- మా ప్రాణాలకు రక్షణ ఏది అంటూ అధికారుల ఆవేదన

విశాలాంధ్ర -కొవ్వూరు : అనుకున్నట్లే జరుగుతుంది . మా ఊరికి మీ ఊరు ఎంత దూరము మీ ఊరికి మా ఊరు అంతే దూరం అన్న చందాన ప్రస్తుత కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం జగన్ హయాంలో ఇసుకసురులు రెచ్చిపోయి అధికారులను ర్యాంపుల దగ్గరకు రానీయకుండా అడ్డు తగిలితే ఇప్పటి కూటమి ప్రభుత్వం ర్యాంపులు దగ్గరికి వచ్చిన అధికారుల మీదే దాడులు చేయిస్తున్నట్లు విశ్వసనీ సమాచారం. కొవ్వూరు పట్టణంలోని ఏరినమ్మ ఘాట్‌లో ఓవర్ లోడ్‌తో వస్తున్న ఒక లారీని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ నేపథ్యంలో సదరు లారీలోవున్న వ్యక్తి మీకేం అధికారం ఉందంటూ టాస్క్‌ఫోర్స్ ఎస్సై పై దాడికి దిగినట్లు సమాచారం. దీంతో సదరు అధికారి ఆ లారీని కొవ్వూరు టౌన్ పోలీస్ స్టేషన్ తరలించి వారికి అప్పగించారు . ఇలాంటి సందర్భంలో విధులు ఎలా నిర్వర్తించాలని టాస్క్ ఫోర్స్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

విశాలాంధ్ర :తాళ్లపూడి తాళ్లపూడి మండలం పోచవరం గ్రామ పంచాయతీలోని ఎస్సీ ఏరియాలో సిమెంట్ రోడ్ల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. ఓసీ ఏరియాలోని మెయిన్ రోడ్‌ను కలిపే రహదారికి గ్రామ పంచాయతీ నిధుల నుంచి రూ. 8లక్షల 60 వేలతో చేపట్టినట్లు వైసీపీ నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు వెల్లడించారు. గ్రామంలో డ్రైన్ నిర్మాణాలు అవసరం వుందని, ప్రభుత్వ సహకారం కొరకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సహకారం కోరుతున్నామని, గ్రామంలో వెనకబడి ఉన్న డ్రైన్లు ఏర్పాటు చేసుకుంటామని, ప్రజల తరపున పంచాయతీ ద్వారా విన్నవించు కుంటున్నట్లు కాకర్ల వెంకటేశ్వరరావు తెలిపారు.

ఏపీ విద్యుత్‌శాఖ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా శ్రీరామ కృష్ణ

విశాలాంధ్ర - కడియం : ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో- జెన్కో డిస్కం క్రికెట్ జట్టు కెప్టెన్‌గా కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన లైన్ మెన్ అడబాల శ్రీ రామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం ఇరవై మందిని జట్టుకు ఎంపిక చేయగా అందులో కెప్టెన్‌గా అడబాల, వైస్ కెప్టెన్‌గా విశాఖపట్నంకు చెందిన టి అభిషేక్‌ను ఎంపిక చేశారు. బాల్యం నుండి అడబాల క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క క్రీడల్లోనూ కొనసాగుతున్నారు. బౌలింగ్, బ్యాటింగ్‌లలో లైన్ మెన్ ప్రతిభ కనబరుస్తారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తరపున రాష్ట్ర జట్టుకు ఎంపికై ఇప్పటివరకు అనేక బహు మతులు అందుకున్న అడబాల రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యారు.

టీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ నర్సరీ సందర్శన

విశాలాంధ్ర - కడియం : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ శనివారం శ్రీ సత్యదేవా నర్సరీ (పుల్లా ఆంజనేయులు & సన్స్) ని సతీ సమేతంగా సందర్శించారు. వారికి పుల్లా ఆంజనేయులు అంథురియం మొక్కతో ఘన స్వాగతం పలికారు. అనంతరం నర్సరీలోని వివిధ రకాల పండ్లు, పూవులు, మరియు ఆర్నమెంటల్ మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ తనకి ఆర్గానిక్ పండ్లు అంటే ఎంతో ఇష్టం అని శ్రీ సత్యదేవా నర్సరీని సందర్శించడం ఆనందంగా ఉందని, వ్యాపారపరంగానే కాకుండా ప్రకృతికి ఎంతో సేవచేసే నర్సరీలు మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే బండారు అభినందన

విశాలాంధ్ర – ఆలమూరు : హ్యుమానిటీస్, లిబరల్ ఆర్ట్స్ కోర్సులకు పేరుగాంచిన అజీమ్ ప్రేమ్ జీ (బెంగళూరు) విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యాభ్యాసం కోసం (2024- 25)నకు (5సంవత్సర ముల కోర్సు) చెముడులంక ఈశ్వర్ విద్యాలయ మహిళా కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు 60% స్కాలర్షిప్‌తో ఆకుల శ్రీవల్లి, 100% స్కాలర్షిప్‌తో సాధనాల నాగప్రవల్లిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు విద్యార్థినులను అభినం దించి, మెమెంటో అందజేశారు. అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం వంటి అతి పెద్ద విశ్వ విద్యాల యంలో సీటు సంపాదించిన ప్రతి విద్యార్థినికి ఉన్నత భవిష్యత్ ఉంటుందని అలాంటి విద్యార్థినులను తయారు చేస్తున్న ఈశ్వర్ విద్యాలయం ఔన్నత్యాన్ని ఆయన ప్రశంసించారు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో మరిన్ని విజయాలతో విద్యార్థినులు ముందడుగు వేయాలని చైర్మన్ ఉమారాణి, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

ఆటో డ్రైవర్ల భద్రతపై అవగాహన : సీఐ

విశాలాంధ్ర – ప్రత్తిపాడు : జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం డిఎస్పి శ్రీహరి రాజు సూచనల మేరకు భద్రత చర్యల్లో భాగంగా శు క్రవారం స్థానిక లయన్స్ క్లబ్‌లో ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు భద్రతపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్తిపాడు సిఐ బి సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతంలు పాల్గొని ఆటో డ్రైవర్లు, ఓనర్లతో మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికుల భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని డ్రైవర్లను కోరారు. అనంతరం ట్రాఫిక్ నియమ నిబంధనలలో భాగంగా ప్రతీ ఒక్క ఆటో డ్రైవర్ తన యొక్క వాహనానికి సంబంధించిన పత్రాలు వాహనంలోనే ఉంచాలన్నారు. ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మహిళలు ద్విచక్ర వాహనంపై వెళ్లేటపుడు డ్రెస్ చున్నీ, చీర కొంగు ప్రమాదవశాత్తు వీల్‌లో చిక్కుకుని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఒక కుటుంబం ఆర్థికంగా ఎంతో నష్టపోతుందని, కుటుంబ పెద్ద తీవ్రంగా గాయపడితే కుటుంబ సభ్యుల మనో వేదన లాంటి దుస్థితి ఎవ్వరికీ రానివ్వకూడదన్నారు. మండలంలో ఉన్న ఆటో డ్రైవర్లు, స్థానికులు వాహనదారులు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

కొల్లు సత్యవేణి, W/o. కొల్లు శ్రీను డోర్ నెంబర్ 1-117 ఉప్పలంక గ్రామం, కరప మండలం, కాకినాడ జిల్లా అను నేను ది.30.6.2025 న పాస్‌పోర్ట్ నెంబర్ U8587601 తీసుకుని బ్యాంకు పనిమీద కాకినాడ వెళుతుండగా MSN చార్టీస్ సమీపంలో పోయినది. నేను ఎంత వెతికినా దొరకలేదు. కావున పై నెంబరు గల పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికినచో ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

సెల్. 8096225042

ఎన్డీఏతోనే ప్రజా సంక్షేమ పాలన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర :తాళ్లపూడి సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు తాళ్లపూడి మండలం టి.మెట్ట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భం లో ఇంటింటికి వెళ్లి ప్రజల క్షేమ సమాచారాలు అడిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి విచ్చేసిన ఆయన మెట్ట గ్రామంలో సి.ఎం రిలీఫ్ ఫండ్ మంజూరైన రెండు కుటుంబాల కు చెక్ లు అంద చేశారు.ఎమ్మెల్యే ముప్పిడి టి.మెట్ట వచ్చిన సమయంలో అప్పటికే రోడ్ ప్రమాదానికి గురైన యస్వంత్ అనే యువకుని ఆరోగ్యం గురించి ఆరా తీసి, 108 వచ్చే వరకు కాకుండా గాయాలు పాలైన యువకుని పోలీస్ జీప్ లో ఆస్పత్రికి దగ్గరుండి తరలించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం గ్రామం లో పర్యటించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు అన్నమరెడ్డి రమణ, సత్తిబాబు, సోమశేఖర్, ఎన్డీయే కూటమి సభ్యులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు తెలిపి, త్వరలో కూటమి ప్రభుత్వం చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు.

గోవింద నామస్మరణతో మారుమ్రోగిన వాడపల్లి

విశాలాంధ్ర – ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పుణ్య క్షేత్రం భక్తజనంతో కిక్కిరిసింది. భక్తులు అత్యధికంగా తరలివచ్చారు. దీంతో..భక్తుల గోవింద నామస్మరణతో వాడపల్లి గ్రామం మారుమ్రోగింది. ఏడు వారాల నోము ఆచరించే భక్తులు మాడవీధుల్లో ప్రదక్షిణలు చేశారు. ప్రతి వారం కంటే అత్యధికంగా భక్తజనులు తరలిరావడంతో..దర్శనం కోసం క్యూలైన్లు భారీగా పెరిగాయి. అయినప్పటికీ ఇబ్బంది పడకుండా..ఏడువారాల నోము ఆచరించే భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని, ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉదయం 3 గంటలనుండే రద్దీ : తెల్లవారుజాము నుండి ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. వేకువజామున 3 గం లకు సుప్రభాత సేవ, తొలి హారతితో ప్రారంభమైన భక్తుల రద్దీ..రాత్రి 10 గంటలవరకు కొనసాగింది. ఉభయ గోదావరి జిల్లాలనుండే కాకుండా..ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అత్యధికంగా తరలివచ్చారు. స్వామి వారిని, భక్తి శ్రద్దలతో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహక అధికారి నల్లం సూర్య చక్రధరరావు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. గంట వ్యవధిలో భక్తులకు స్వామివారి దర్శనం పూర్తయ్యేలా కృషి చేసారు. ఎండ వేడి వల్లఇబ్బంది పడకుండా, ఎక్కడికి అక్కడ టెంట్లు వేశారు. ాటు ఉచిత మజ్జిగ, చంటి పిల్లలకు పాలు బిస్కెట్లు పంపిణీ చేశారు. స్వామివారికి రూ.62,52,071 లక్షల సాయంత్రం ఐదు గంటలకు వచ్చిన ఆదాయం దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు వెల్లడించారు. సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, కుమార్, వర్మ, శ్రీను, పోలీస్ సిబ్బందితో పాటు, గ్రామస్తులు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు నిర్వహించారు.

బేయర్ ఫెలుజిత్‌తో వరి పొలాలకు రక్షణ

రాజమండ్రి: వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ వంటి జీవ శాస్త్ర రంగాలలో కీలక సామర్థ్యాలు కలిగిన ప్రపంచ సంస్థ బేయర్, వరి సాగులో పాముపోడ తెగులు నుంచి అన్ని మొక్కల భాగాలకు రక్షణ కల్పించడానికి వినూత్న శిలీంద్ర సంహారిణి అయిన ఫెలుజిత్‌ను రూపొందించినట్లు బేయర్ క్రాప్ సైన్స్ విభాగం క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్ బాబు అన్నారు. ఈ ఉత్పత్తి జూలై నెల నుంచి దేశంలోని ముఖ్యమైన వరి పండించే రాష్ట్రాలన్నింటిలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. తెగుళ్ళు, వ్యాధుల నుంచి పెరుగుతున్న సవాళ్లతో వ్యవసాయ రంగం పోరాడవలసి వస్తున్న పరిస్థితుల్లో.. నేలలో ఉద్భవించే ఈ నిరంతర వ్యాధిని రైతులు ఎదుర్కొనే విధానాన్ని మార్చడానికి పెన్‌ఫ్లుఫెన్, టెబుకోనజోల్‌లను కలిపిన ప్రత్యేకమైన ఫార్ములాతో సిద్ధంగా ఉందన్నారు. దీనిని వినియోగిస్తే దాని ద్వంద్వ చర్య ద్వారా మొక్క దేహం అంతటా పాముపోడ తెగులు పెరుగుదలను సమర్థవంతంగా నిరోధిస్తుం దన్నారు. రైతులకు పంట దిగుబడి నాణ్యతను పెంచే నమ్మకమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ప్రస్తుత మార్కెట్ ప్రమాణాల కంటే రెండు రెట్లు ఎక్కువ ఉండే ఉన్నతమైన సామర్థ్యాన్ని ఒక్క బేయర్ ఫెలుజిత్ స్ప్రే అందిస్తుందన్నారు. రైతులు అనేక రకాలను విని యోగించాల్సిన అవసరం, భారం లేకుండా సమర్థవంతమైన వ్యాధి నియంత్రణను సాధించవచ్చునని చెప్పారు. రైతులకు అత్యంత ప్రభావవంతమైన పరిష్కారం ఫెలుజిత్, ఇది వారి వ్యవసాయ పద్ధతులను క్రమబద్ధీకరిస్తూనే పోడతెగులుపై అద్భుతమైన నియంత్రణను అందిస్తుందన్నారు. ప్రపంచ ఆహార భద్రతలో వరి కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, తక్కువ వ్యయ ప్రయాసలు, పద్ధతులతో వ్యాధిని సమర్థవంతంగా నిర్వహించడానికి, తమ వనరులను సరైన విధంగా వినియోగించడానికి పెరుగుతున్న వ్యవసాయ సవాళ్లమధ్య లాభదాయకతను పెంచడానికి ఈ ఆవిష్కరణ రైతులకు అవకాశం ఇస్తుందన్నారు. ఫెలుజిత్ యూఎస్‌పీ దాని ద్వంద్వ క్రియ ఫార్ములాలో ఉంది, పోడ తెగులుకు కారణమయ్యే ప్రధాన జీవి అయిన రైజోక్టోనియాను ఎదుర్కోవడా నికి రెండు క్రియాశీల పదార్థాల బలాలను ఇది మిళితం చేస్తుందన్నారు. ఈ వినూత్న విధానం ప్రభావవం తమైన నియంత్రణను నిర్ధారించడమే కాకుండా అప్లికేషన్ సామర్థ్యాన్ని మెరుపరచడం ద్వారా స్థిరమైన వ్యవసాయ పద్ధతులకు మద్దతు ఇస్తుందని చెప్పారు.

తడి, పొడి చెత్త సేకరణ

విశాలాంధ్ర – కరప : కరప మండలం గొడ్డటి పాలెం గ్రామంలో తడి పొడి చెత్త సేకరణ పై చర్యలు చేపట్టామని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ పై ప్రజల్లో అవగాహన కల్పించామని శ్రీనివాసరావు తెలిపారు. చెత్తను సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేసి రైతులకు తక్కువ ధరకే అందించేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోన అనూష ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఇంటిలో చోరీ

విశాలాంధ్ర – సీతానగరం: ఇంటిలో లేని సమయంలో భారీ చోరీ చోటు చేసుకొంది. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయితీ పరిధిలో రవీంద్ర కాలనీలో శనివారం ఒక్కసారిగా ప్రజలు ఉలిక్కి పడే ఘటన చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రవీంద్ర కాలనీ నివాసం ఉంటున్న సురవరపు మణికంఠ తండ్రి పేరు రాజారావుకు చెందిన ఇంటిలో భారి మొత్తంలో చోరీ జరిగింది. జూన్ 28న తన అక్క నిడదవోలులో నివాసం ఉంటున్నారు. దానితో రెండు వారాలనుండి ఇంటికి తాళం వేసి అక్కడకు వెళ్ళారు. శనివారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటిలో సామాన్లు చిందరవందరగా ఉండగా బీరువా తాళం సైతం తెరచి ఉండడంతో ఉలిక్కి పడ్డ మణికంఠ పోలీసులకు సమాచారం అందించారు. బెడ్ రూమ్, దేవుడు గదిలో ఉన్న 4 కాసుల బంగారం బిస్కట్, 90 తులాలు వెండి, రూ.3 లక్షల 90 వేలు నగదు పోయిందని తెలిపారు. దీంతో ఎస్ ఐ డి రామ్ కుమార్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ శ్రీను, కానిస్టేబుల్ మణిబాబు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. అలాగే క్లూస్ టీమ్ కూడా ఆధారాలు సేకరణ చేసింది. దీంతో ఒక్కసారిగా రఘుదేవపురం గ్రామ ప్రజలు ఉలిక్కి పడ్డారు.

మనస్తాపంతో తనువు చాలించిన భర్త

విశాలాంధ్ర – రాజానగరం : భార్యాభర్తల మధ్య గత కొంతకాలంగా చెలరేగిన మనస్పర్థల కారణంగా మనస్తాపం చెందిన భర్త బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన కొంతమూరులో చోటుచేసుకుంది. రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామంలో నివాసం ఉంటున్న గొర్ల గోవిందరావు (44) తన ఇంటి ఆర్చ్‌కి ఉన్న హుక్కికి ఉరి వేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి సంబంధించి రాజానగరం ఎస్.ఐ.ఎస్.ప్రియకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం కొంతమూరు గ్రామానికి చెందిన గోవిందరావుకి తాళ్లూరు గ్రామానికి చెందిన విజయతో సుమారు పదిహేను ఏళ్ల క్రితం వివాహం జరిగిందన్నారు. వీరికి పాప, బాబు ఇద్దరు సంతానం ఉన్నట్లు చెప్పారు. గోవిందరావు స్థానికంగా దంత పరికరాలు సాంకేతిక నిపుణులుగా(డెంటల్ ఎక్విప్మెంట్ టెక్నీషియన్)గా చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో గత ఐదేళ్లుగా వీరిద్దరి మధ్య చిన్నపాటి గొడవలు చోటుచేసుకుంటున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఇటీవలే మృతుడి భార్య విజయ తన కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయినట్లు చెప్పారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన గోవిందరావు తన ఫోన్లో వీడియో తీసుకొని భార్య లేని జీవితం నాకెందుకు, అంటూ తన కుటుంబ సభ్యులకు వివరిస్తూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జరిగిన ఉదంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి పోస్టమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్.ఐ.ప్రియ కుమార్ తెలిపారు.

పంటలకు సాగునీరు అందించాలి

సీపీఐ ద్వితీయ మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర – పిఠాపురం : రైతులకు పంటలు పండించుకునేందుకు పిఠాపురం నియోజకవర్గంలో నీరు అందడం లేదని వెంటనే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పిఠాపురం ఎమ్మెల్యే కొణిదెల పవన్ కళ్యాణ్ స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రైతులకు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు విజ్ఞప్తి చేశారు. జులై 15, 16 తేదీల్లో సామర్లకోటలో జరుగు, సీపీఐ కాకినాడ జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పిఠాపురంలో సీపీఐ పిఠాపురం కార్యదర్శి. సాకారామకృష్ణ ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సిపిఐ మహాసభలను జయప్రదం చేయాలని తాటిపాక మధు కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ బాడకొండ, మహిళా సమైక్య జిల్లా నాయకురాలు భవాని, నాయకులు అప్పలరాజు, అర్జున్ రావు, చిట్టిబాబు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత : ఎమ్మెల్యే

విశాలాంధ్ర – ఆత్రేయపురం : కూటమి ప్రభుత్వంలో వైద్య ఆరోగ్య సేవలకు ప్రథమ ప్రాధాన్యం లభిస్తుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనసున్న నాయకుడని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎందరికో ఆపన్న హస్తాన్ని అందిస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను ఆయన బాధితులకు అందించారు. యడ్ల వెంకటేశులు, అంకంపాలెం రూ.25000 , చొల్లంగి దేవి, అంకంపాలెం రూ.25000, ముదునూరి సుబ్బరాజు, ఆత్రేయపురం రూ.63742, పచ్చిమట్ల శ్రీనివాసరాజు, ఆత్రేయపురం రూ.1,40,000, అవిడి అంకాలు, లొల్ల రూ.97,012, శివంగుల గణేష్, నార్కెడిమిల్లి రూ.55,000, పెండెం రాముడు, ర్యాలి, రూ.30786 , యేడిద సోమరాజు, వసంతవాడ,రూ.50,000 తోర్లపాటి శరత్ కుమార్ రూ.1,52,890, నల్లి సతీష్ కుమార్ పులిదిండి ఎల్వోసీ రూ.1,75,000, ముదునూరు సింధూర ఆత్రేయపురం ఎల్వోసీ రూ.75,000, బుద్ధిగ సాయి రాంబాబు ర్యాలి ఎల్వోసీ రూ.3,00,000 అలాగే రావులపాలెం ఆలమూరు, కొత్తపేట మండలాలు కలుపుకొని మొత్తం 55 మందికి రూ.40,27,237 విలువైన చెక్కులను అందించారు.చెక్కులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే సత్యానందరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

హామీలు అమలుచేయని ప్రభుత్వం : ఎమ్మెల్సీ బొత్స

విశాలాంధ్ర – జగ్గంపేట(కిర్లంపూడి) : ఆంధ్ర ప్రజలకు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేసిన పార్టీ ఏదైనా ఉందంటే ఒక్క తెలుగుదేశం పార్టీయేనని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని మాజీ మంత్రి వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో తన స్వగృహంలో ప్రతిపాడు వైసీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు అధ్యక్షతన బాబు షూరిటీ మోసం గ్యారంటీ విస్తృతస్థాయి సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బొత్స సత్యనారాయణ చంద్రబాబు పాలనలో జరిగే లోసుగులు వివరించారు. కాకినాడ జిల్లా వైసిపి అధ్యక్షుడు మాజీ మంత్రివర్యులు దాడిశెట్టి రాజా, మాజీ హోంమంత్రి తానేటి వనిత, మాజీ మంత్రివర్యులు తోట నరసింహం, చెల్లుబోయిన వేణుగోపాల్, మాజీ గృహ నిర్మాణ శాఖ చైర్మన్ దవులూరి దొరబాబు, గోపాలపురం ఎక్స్ ఎమ్మెల్యే చింతలూరి వెంకటరావు, తోటరాంజీ, మాజీ ఎమ్మెల్యేలు, పలు నియోజకవర్గాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడారు. ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేసిన దొంగలు కూటమి ప్రభుత్వం వారేనని అని కార్యకర్తలకు చూపిస్తూ విమర్శించారు. రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్న వైసిపి మరల అధికారం చేపడుందని అన్నారు. వైసిపి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్న రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి జన సైనికులకు మాస్ వార్నింగ్ అంటూ మీ తాటకు చప్పళ్ళకి భయపడేది లేదని ఘాటుగా విమర్శలు చేశారు. 2024 ఎన్నికల్లో గెలిచిన తర్వాత సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం చెయ్యడమే చంద్ర బాబు పని అని విమర్శించారు. భారీ సంఖ్యలో ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి వైయస్సార్సీపి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా మెడికల్ క్యాంపు

విశాలాంధ్ర – అమలాపురం : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం మరియు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత మెగా మెడికల్ క్యాంపు అమలాపురం వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ళ జనార్దన రావు కళ్యాణమండపం, కొల్లూరు సత్యనారాయణ మూర్తి (గున్నయ్య) కళ్యాణమండపంలో జరుగుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కంచర్ల వేంకట్రావు(బాబి), సంఘ మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, సంఘ ఉపాధ్యక్షులు వరదా సూరిబాబు, నంబూరి సత్యనారాయణ మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సింగంశెట్టి కుమార్‌లు తెలిపారు. మెగా మెడికల్ క్యాంపును స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రారంభిస్తారని వివిధ విభాగాలను రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్, మరియు వివిధ నియోజకవర్గాల శాసనసభ్యులు పాల్గొని ప్రారంభించనున్నారన్నారు. వెరికోస్ వీన్స్, గుండె, ఆర్థోపెటిక్, గ్యాస్ట్రో, స్కిన్, గైనిక్, డెంటల్, ఇఎన్టి, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహిస్తారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2025

విశాలాంధ్ర – గండేపల్లి : ఆదిత్య విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్లు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్– 2025 కార్యక్రమాన్ని జులై 12, 2025న సూరంపాలెం, యెర్రంపాలెం గ్రామంలో నిర్వహించాయి. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించే జాతీయ మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ప్రొ ఛాన్సలర్ డా ఎం శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొ ఎంబి శ్రీనివాస్, డీన్–విద్యార్థి వ్యవహారాలు డా డి కిషోర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా ఐవి వీరాంజనేయులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, ప్రవర్తనా మార్పు ప్రాముఖ్యతను ఈ కార్యక్రమంలో వారు ప్రస్తావించారు. వలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రజలకు కార్యక్రమ లక్ష్యాలు వివరించడంతో పాటు, QR కోడ్ ద్వారా తమ గృహ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకునే విధానాన్ని సూచించారు. విద్యార్థుల సామాజిక బాధ్యతను పెంపొందించడంలో మరియు సమాజానికి సేవ చేయడంలో ఒక కీలకపాత్ర పోషించింది.

కాగితపు సంచులతో కాలుష్య నివారణ

విశాలాంధ్ర – కాకినాడ రూరల్ : ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణానికి ప్రధాన సమస్య అయినందున కాగితపు సంచులను వినియోగించాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ కాగితపు సంచుల దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ సంచుల స్థానే కాగితపు సంచుల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జులై 12న కాగితపు సంచుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. పర్యావరణ ఆందోళనతో ఇప్పటికే పలు దేశాలు కాగితపు సంచుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని కాగిత సంచులను వినియోగించాలని కృష్ణమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్ నగేష్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి విరాళం

విశాలాంధ్ర – ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలోని వెలిసిన పురాతనమైన దేవాలయాల్లో విశిష్ట కలిగిన ఆలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం. ఆలయంలో ఈ ముందు పురుషుని రూపం వెనుక స్త్రీ రూపంలో భక్తులకు స్వామి వారు దర్శనం ఇస్తారు. హైదరాబాద్ వాస్తవ్యులు కొడుకుల నరసింహారావు శర్మ శశిరేఖ దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి దేవస్థానంనకు రూ.50,000లు విరాళంగా ఆన్ లైన్ ద్వారా అందించారు. వీరిని ఆలయ అర్చకులు వేద మంత్రాలతో పూజలు, ఆశీర్వచనాలు అందించగా కార్యనిర్వహణ అధికారి భాగవతుల వెంకట రమణ మూర్తి, శ్రీనివాస్, దత్తు స్వామి వారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రాలతో, ప్రసాదం పోస్ట్ ద్వారా అందజేశారు.

మంచినీటి సరఫరా

విశాలాంధ్ర – కరప : కరప మండలం గొర్రిపూడి గ్రామంలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టమని పంచాయతీ కార్యదర్శి వీరబాబు పేర్కొన్నారు. జి వేమవరం గ్రామంలో ఓహెచ్ ఆర్ఎస్ మంచినీటి చెరువు పనులు జరుగుతున్నందున గొర్రిపూడి గ్రామానికి నీటి కొరత లేకుండా, కోస్టల్ ఆక్వా కంపెనీ, శ్రీ రామలింగేశ్వర రైస్ మిల్ వారి సహకారంతో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.

నిత్యవసర సరుకుల పంపిణీ

విశాలాంధ్ర – కాకినాడ రూరల్ : రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి మాట్లాడుతూ తమ సంక్షేమ సంఘం తరపున ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జీ కృష్ణమోహన్ మాట్లాడుతూ పరోపకారం పరిమళత్వం ద్వారా మానవజన్మ ధన్యమవుతుంది కాబట్టి ప్రతి ఒక్కరూ సాటి మానవుల పట్ల ప్రేమతో వ్యవహరించాలని అన్నారు. కోరమండల్ మహిళా క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని కృష్ణమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో వెంకట దుర్గావతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లీశ్వరి, కవిత, మానస, పద్మా మోహన్, దీపిక, మాధవి లత, రత్నం, లక్ష్మీ సృజన, మోహిని, ఎంవిఎస్ఎల్ ప్రసూన, శ్రీదేవి రెడ్డి, శ్రీవాణి, వి జయలక్ష్మి, డాక్టర్ శిరీష, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ వార్షికోత్సవం

విశాలాంధ్ర – అమలాపురం : అమలాపురం డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ 74వ ఆవిర్భవ దినోత్సవం డిపో అధ్యక్షులు పివి రమణ అధ్యక్షతన యూనియన్ ఆఫీస్ నందు జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎఐటియుసి అధ్యక్షులు కే సత్తిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్స్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల్ని పూర్తిగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మేడిది శ్రీనివాసరావు, డిపో కమిటీ సభ్యులు, గ్యారేజీ కార్మికులు అత్యధికలో కార్మికులు పాల్గొన్నారు.

నేడు బాబు షూరిటీ -మోసం గ్యారంటీ సభ

విశాలాంధ్ర – అమలాపురం : అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో ఆదివారం జరగబోయే బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షణ అమలాపురం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్‌తో కలిసి పాల్గొన్న వైసీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనువాస్...ఈ కార్యక్రమంలో సంసాని బులినాని, కుడుపూడి బాబు, మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము, గొవ్వల రాజేష్, పందిరి హరి, కేతా భానుతేజ, సరేళ్ళ రామకృష్ణ, ముషిని రాఘవేంద్ర, దూడల ఫణి, తోరం గౌతమ్, సుధా గణపతి, సుబ్బారాం, దాసరి దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగ అభివృద్ధికి ముందడుగు : ఎంపీ

విశాలాంధ్ర - కాకినాడ : దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఉప్పాడ చేనేత రంగాన్ని అభివృద్ధి చేసి చేనేత కార్మికుల జీవనోపాధిని మరింత మెరుగుపరి చేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. యు కొత్తపల్లి మండలంలో ఉప్పాడతో పాటు అనేక గ్రామాల్లో చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఆదుకునేం దుకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రాం మంజూరు చేసి నిధులు మంజూరు చేయాలని గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేంద్రానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ పథకం అమలైతే రూ.15 కోట్లు నిధులు మంజూరు అవుతాయని, ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.12 కోట్లు కాగా మిగిలిన 3 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ నిధులతో ఉప్పాడలో చేనేత రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అభివృద్ధి చేయడంతో పాటు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్న సుమారు 700 మంది చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కలుగుతున్నారు. నిధులు మంజూరుకు పలుమార్లు కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను వ్యక్తిగతంగా కలిసి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించిన కేంద్రం త్వరలో చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న వీవర్స్ సర్వీస్ సెంటర్, జోనల్ డైరెక్టర్ నేతృత్వంలో సాంకేతిక కమిటీని ఉప్పాడలో పర్యటించి నివేదిక అందించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. త్వరలోనే సాంకేతి కమిటీ ఉప్పాడ తదితర గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తుందని, కమిటీ నివేదిక ఆధారంగా కేంద్రం నిధులు విడుదల చేస్తుందని అందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

మాజీ మంత్రి పేర్ని వ్యాఖ్యలపై మంత్రి ఫైర్

విశాలాంధ్ర - కాకినాడ/రామచంద్రపురం : మంత్రి క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి సుభాష్ మాజీ మంత్రి పేర్ని నాని, వైసీపీ నాయకులపై ఫైర్ అయ్యారు. వైసీపీ కార్యక్రమంలో పేర్ని నాని మంత్రి లోకేష్‌ను సంబోధించిన తీరును మంత్రి సుభాష్ తప్పుపట్టారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రపరపా నడికేస్తానని చేసిన వ్యాఖ్యలను సమర్థించిన నానీ అసభ్య పదజాలంతో హింసను ప్రోత్సహిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కుక్కలకు పిహెచ్‌డీ చేయడంలో నువ్వే దిట్టా అంటూ మంత్రి సుభాష్ పేర్ని నానిపై సెటార్ వేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తండ్రిని, తల్లిని, చెల్లిని, చిన్నాన్నను, ఎన్నిక ప్రచారంలో ఉపయోగించుకుని ఒక్క ఛాన్స్ అంటూ రాజకీయాలకు వచ్చాడని, ఒక్క ఛాన్స్ అంటూ వచ్చిన జగన్ ఒక్కఛాన్స్‌తో ఇంటికి పంపించారన్నారు. సంక్షేమం అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ వాళ్లు మోసం గ్యారంటీ అంటూ పిచ్చి కార్యక్రమాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ కార్యకర్తలు కొడాలి నానికి చీరలు జాకెట్లు ఇస్తామని ప్రస్తావించారు. అటువంటి ప్రస్తావన పెట్టొద్దని చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు హిందూ సాంప్రదాయం ప్రకారం చీరకు జాకెట్‌కు అత్యంత విలువిస్తారు. మనం ఉన్న విలువను తీసినట్టు వద్దు. కొడాలి నానికీ అండర్ వేరు, బనియన్ కరెక్ట్. ఎప్పటికైనా కొడాలి నానిని బనీలు డ్రాయర్లతో నిలబెట్టే రోజు వస్తుందన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఒక్క ఛాన్స్ అన్నారు. ఒక్క ఛాన్స్ ఇచ్చారు. వచ్చినదాన్ని నిలబెట్టు కోలేకపోయారన్నారు.

వరద ముంపు ప్రాంతాలకు చేరుకున్న రాష్ట్ర విపత్తు నివారణ దళం

విశాలాంధ్ర కుక్కునూరు/వేలేరుపాడు: జిల్లా గోదావరి వరద ఉధృతి దృష్ట్యా సహాయ చర్యల నిమిత్తం రాష్ట్ర విపత్తు నివారణ దళం ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరు పాడు చేరుకుంది. కుక్కునూరు మండలానికి 35 మందితో కూడిన బృందం అత్యవసర సమయాలలో తమ సేవలందించేందుకు చేరుకున్నాయి. వరద ప్రభావిత గ్రామాలలోని ప్రజలను వరద పునరావాస కేంద్రా లకు అధికారులు తరలిస్తున్నారు. వరద సహాయ పునరావాస కేంద్రాలలో ప్రజలకు పరిశుభ్రమైన వాతా వరణంలో, రుచికరమైన భోజనం అందించడం జరిగిందని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి చెప్పారు.దాచారం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటుచేసిన వరద సహాయ పునరావాస కేంద్రం లోని ప్రజలకు శనివారం బోజనాలను జిల్లా పరిషత్ సీఈఓ,రెవిన్యూ సిబ్బంది దగ్గరుండి వడ్డించారు.పునరావాస కేంద్రంలోని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు .వరద ముంపు ప్రభావం తగ్గేవరకూ ప్రజలను పునరావాస కేంద్రాలలో ఉంచడం జరుగుతుందన్నారు. పునరావాస కేంద్రంలో ప్రజలు అధిక సంఖ్యలో ఉంటున్న కారణంగా పారిశుద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు.ఎక్కడా చెత్త లేకుండా, మురుగునీరు నిల్వ లేకుండా శుభ్రం చేస్తున్నారు. కుక్కునూరు మండలంలోని ముంపు ప్రమాదం ఉన్న గ్రామాలలోని ప్రజలందరినీ పునరావాస కేంద్రాలకు తరలించేం దుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కుక్కునూరు మండలంలోని అన్ని శాఖల అధికారులు వరద సహాయ పునరావాస కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. గొమ్ముగూడెం నుండి 170 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. రేపాకగొమ్ము గ్రామ ప్రజలకు వరద ముంపు ప్రభావంను తెలియజేసి పునరావాస కేంద్రాలకు రావలసిందిగా జంగారెడ్డిగూడెం ఆర్డీఓ ఎం.వి. రమణ, డి.ఆర్.డి. ఏ. పీడీ ఆర్. విజయరాజు లు విజ్ఞప్తి చేసి, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు: జిల్లాలో వరద తగ్గేవరకూ అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలంలో వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకుంటున్నారు. వరద ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు ప్రమాదం ఉన్న గ్రామాల ప్రజలందరికీ వరద ముంపు ప్రమాదంను తెలియజేసి, వెంటనే వరద సహాయ పునరావాస కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వరదల కారణంగా ఒక్కరికీ ప్రాణ, ఆస్థి నష్టాలు వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరద సహాయక చర్యలను చేపట్టి, పర్యవేక్షించేందుకు నియమించిన మండల ప్రత్యేక అధికారులు ఎక్కడా ఏ పొరపాటు జరగకుండా సహాయక చర్యలు చేపట్టాలన్నారు. వరద ప్రమాద మండలాల్లోని ప్రజలు నదిలోకి చేపలు పట్టేందుకు వెళ్లకుండా చూడాలన్నారు. నిండు గర్భిణీలను దగ్గరలోని సామజిక ఆరోగ్య కేంద్రాలకు తరలిం చాలన్నారు. పునరావాస కేంద్రాలలో జెనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలని, త్రాగునీటి కి ఇబ్బంది లేకుండా అవసరమైన ట్యాంకర్లను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. పునరావాస కేంద్రంలో వంట సామగ్రి, నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. వరద నీరు ఉధృతంగా ప్రవహించే కల్వర్టులు, కాజ్ వే లు, రహదారులను ముందస్తుగా మూసి ఉంచడంతోపాటు ప్రజలు ప్రయాణించకుండా ఆ ప్రాంతాలలో సిబ్బందిని నియమించాలన్నారు. వరదల కారణంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ప్రజలకు కాలుష్య ఇక్కట్లు

> పవిత్ర గోదావరి నది పేరు చెప్తే దేశ వ్యాప్తంగా గుర్తుకు వచ్చేది పుష్కరాలు. అలాంటి పుష్కర గోదావరి తీరా పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికి పాలకుల స్వార్థం, వ్యాపార దోపిడీ, స్థానిక ప్రజలకు శాపంగా మారింది. ప్రభుత్వాలు ఏమైనప్పటికీ, అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా ఇసుక దోపిడి నిరంతరం జరుగుతునే ఉంది. ఒక పక్క ట్రాఫిక్ ఇబ్బందులు, మరో వైపు రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందలాది లారీలు అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. మరోవైపు పేపర్ మిల్లు కాలుష్యం వలన అనేక మంది క్షయవ్యాధులకు గురవుతున్నారు. సమస్యలపై స్థానిక ప్రజలు పాలకులకు ఎన్నిసార్లు విన్నవించిన ఆలకించే పాలకులు లేరని వాపోతున్నారు. దీంతో ఇప్పటికైన పాలకులు ఇసుకదోపిడీ, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి కాదు.. కాటేస్తున్న పాలకులు

- ఒక వైపు పేపర్ మిల్లు
- మరో వైపు అక్రమ ఇసుక రవాణా

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : పవిత్ర గోదావరి నది పేరు చెప్తే దేశ వ్యాప్తంగా గుర్తుకు వచ్చేది పుష్కరాలు. 12 సంవత్సరాలకు ఒక్క సారి జరిగే పుష్కరాలకు దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి కోట్లాది మంది భక్తులు వచ్చి పుణ్య స్నానాలు ఆచరిస్తారు. వందల కిలో మీటర్ల నుంచి భక్తులు వచ్చి పాప పరిహార్థితం స్నానాలు ఆచరిస్తారు. పితృదేవతల కోసం పిండ ప్రధానాలు చేస్తారు, ప్రత్యేక పూజలు చేయిస్తారు. వారి ఆత్మ శాంతించాలని కోరుకుంటారు. కానీ అదే పవిత్ర గోదావరి రాజమండ్రి చెంతన ఉన్న ప్రజలకు శాపంగా మారింది. ప్రకృతి ప్రసాదిస్తున్న ఇసుక గోదావరి ఆనుకుని ఉన్న ప్రజలను అనారోగ్యాలకు గురి చేస్తోంది. గోదావరి పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పటికి పాలకుల స్వార్థం, వ్యాపార దోపిఢీ స్థానిక ప్రజలకు శాపంగా మారింది. ప్రభుత్వాలు ఏమైనప్పటికి, అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా ఇసుక దోపిడి నిరంతరం జరుగుతునే ఉంది. వైఎస్ఆర్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎంత ఇష్ట రాజ్యంగా దోజుకున్నారో నేడు టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అంతకు మించి ఇసుకు అక్రమణ జరుగుతునే ఉంది. పేరుకే ఉచిత ఇసుక కాని సామన్య మధ్య తరగతి ప్రజలకు ఇసుక అందాలంటే అది సాధ్యం కాదు. అధికార యంత్రాంగం చెప్తున్నట్లు ఏ ఒక్కరికి ఉచిత ఇసుక అందడం లేదు కాని పాలకులు మాత్రం ఉచిత ఇసుకపై ప్రకటనలు చేస్తున్నారు. ఇది కేవలం హామిల వరకునే పరిమితమైంది.

కాలుష్యంతో అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు

రాజమండ్రి పరిసర ప్రాంత ప్రజలను కాటేస్తున్నది ప్రకృతి కాదు పాలకులు, ఎవరు అధికారంలో ఉంటే వారే డబ్బు సంపాదనే ధ్యేయంగా, వ్యవహారిస్తున్నారు. అధికారులను భయపెట్టో, డబ్బుపై ఆశ చూపో వారు అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఫలితంగా గోదావరి గట్టు తీర ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక పక్క ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు, మరో పాటు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు.రాత్రి, పగలు అనే తేడా లేకుండా వందలాది లారీలు అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో ప్రజలు వాతావరణ కాలుష్యంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వంలో ఆనాటి పాలకులు చేసిన అక్రమ వ్యాపారాన్ని మించి నేటి కూటమి నేతలు ఇసుక దందా సాగిస్తూ కోట్లాది రూపాయిలు దోచుకుంటున్నారు. రోడ్డుపై నడిచి వెళ్ళే ప్రజలు ముక్కుమూసికుని వెళ్ళే పరిస్థితులు లేవంటే ఇసుక రవాణా ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. ఇప్పటికే రాజమండ్రిలో ఉన్న పేపర్ మిల్లు కాలుష్యం వలన అనేక మంది టి.బి. వంటి రోగాలకు గురవుతుండగా, పాలకుల ఇసుక దోపిడీ వలన కొత్త వ్యాధులు వస్తున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎంత మెరపెట్టుకొన్నా వారి గోడు పట్టించుకనే వాడులేడు. ఇసుక అక్రమ రవాణా వలన రాజమండ్రిలోని శ్రీరామ్‌నగర్, మల్లయ్యపేట, ఆనందనగర్, క్వారీ మార్కెట్ సెంటర్, వెంకట నగర్, సిద్ధార్థ నగర్,ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అక్రమ ఇసుక రవాణా వలన ప్రధానంగా చిన్న పిల్లలు, వృద్ధులు అనేక శ్వాసకోస వ్యాధులకు గురవుతున్నారు. ఆయా ప్రాంత స్థానిక ప్రజలు ఎన్నిసార్లు పాలకులకు మొరవినిపించినా వారికి ధనార్జేనే ధ్యేయంగా చెముటివాటి చెవిలో శంఖం ఊదినట్లుగా ఉంది. దుకాణాల వద్ద సేవ్ మల్లయ్యపేట అనే ఫ్లెక్స్ ఏర్పాటు చేసి తమ నిరసన తెలియచేయడం సమస్య తీవ్రతను తెలుపుతుంది